క్లుప్తంగా

మురుగు తొలగించారు



సాక్షి ఎఫెక్ట్..

దోర్నకల్: స్థానిక శాంతినగర్‌లో రోడ్డు పక్కన సైడు కాల్వలో పేరుకుపోయిన మురుగు, చెత్తను శనివారం పారిశుద్ధ్య సిబ్బంది తొలగించారు. శాంతినగర్‌లోని నిర్మలా స్కూల్ పక్కన మురుగునీటి నిల్వతో ఇబ్బందులపై 'సాక్షి'లో కథనం వెలువడటంతో స్పందించిన మున్సిపల్ సిబ్బంది మురుగును తొలగించి కాల్వను శుభ్రం చేశారు.

వార్డుల్లో సమస్యలు

నెహ్రూసెంటర్: ప్రజల పక్షాన పోరాడేది సీపీఐ పార్టీయేనని జిల్లా కార్యవర్గసభ్యుడు చింతకుంట్ల వెంకన్న అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 20, 23, 24 వార్డుల్లో సీపీఐ బృందం పర్యటించి శనివారం ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు పద్మ, మహేశ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఉచిత శిక్షణ

మహబూబాబాద్: సమర్దనం ట్రస్ట్ ఫర్ ది డిసబుల్ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో దివ్యాంగ నిరుద్యోగులకు స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమంలో భాగంగా హైదరాబాద్‌లో కంప్యూటర్, సాఫ్ట్ స్కిల్స్, స్పోకెన్ ఇంగ్లిష్, బీపీఓ స్కిల్స్‌లో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ ప్రతినిధి ఎస్.శ్రావణ్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ 90రోజులపాటు బాలబాలికలకు ప్రత్యేక హాస్టల్ వసతి ఉంటుందన్నారు. పదో తరగతి విద్యార్హత ఉండి 18 సంవత్సరాల పైబడిన వారు ఇంటర్ డిప్లొమా, డిగ్రీ ఇంజనీరింగ్, పీజీ చదివిన ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాల కోసం 040-48502125, 90105 62803 నంబర్లను సంప్రదించాలన్నారు.

అక్రమ కట్టడాలను నిలిపివేయాలి

బయ్యారం: మండలకేంద్రంలోని సీఎంసీ స్థలంలో అక్రమంగా నిర్మిస్తున్న కట్టడాలను నిలిపివేయాలని కోరుతూ శనివారం అఖిల పక్షం ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. గ్రామానికి చెందిన స్థలంలో కొందరు వ్యక్తులు ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు ముసలయ్య, మధుకర్‌రెడ్డి, ఐలయ్య, వెంకటేశ్వర్లు, రాజన్న, జగ్గన్న, సూర్యం, శ్రీను, బాబురావు, తదితరులు పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

కొత్తగూడ: అక్రమంగా సుమారు 25 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం తరలిస్తున్న బొలేరో వాహనం శనివారం సీజ్ చేసినట్లు ఎస్సై కుశకుమార్ తెలిపారు. మండలంలోని పొగుళ్లపల్లి నుంచి అర్ధరాత్రి రెండు గంటల సమయంలో అదేగ్రామానికి చెందిన రాగి ఉపేంద్రాచారి పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తున్నట్లు స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు పట్టుకుని వాహనం సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు వివరించారు. ఉపేంద్రాచారిపై కేసు నమోదు చేసి బియ్యం ఎక్కడి తరలిస్తున్నారనే అంశంపై దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

విజయవంతం చేయాలి

గూడూరు: జిల్లా కేంద్రంలో నేడు జరుగనున్న బామ్‌సెఫ్ రాష్ట్ర క్లస్టర్ సమావేశాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూక్య సురేష్‌నాయక్ కోరారు. మండల కేంద్రంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాజ్యాంగ పరిరక్షణకు సమావేశం జిల్లా కేంద్రంలోని గంగపుత్ర భవన్‌లో జరుగుతుందని, మేధావులు, సామాజికవేత్తలు, విద్యార్థులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

మరిపెడ: మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని భారత కార్మిక సంఘాల సమైక్య జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి రవి అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. మున్సిపల్ సిబ్బందికి సబ్బులు, చీపుర్లు, మాస్కులు, రేయిన్ కోట్లు వెంటనే అందించాలన్నారు. సమానపనికి సమాన వేతనం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం ఉద్యోగికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ముజంపల్లి వీరన్న, రామ్‌లాల్, పద్మ, వెంకటమ్మ, నీలమ్మ, సుజాత పాల్గొన్నారు.

వైద్యశిబిరం

పెద్దవంగర: వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే వ్యాధులు దరి చేరవని పల్లెదవాఖానా వైద్యుడు రాజ్‌కుమార్ అన్నారు. శనివారం మండలంలోని కొరిపల్లి గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది ఏఎన్‌ఎం బూబా, ఆశవర్కర్ పుష్ప, జీపీ కార్యదర్శి రజిత పాల్గొన్నారు.

కేసముద్రం: ఇనుగుర్తి మండలంలోని చీన్యా తండాజీపీ శివారు ఐలయ్యబావితండాలో ఇనుగుర్తి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యశిబిరాన్ని శనివారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో హెచ్ఈఓ భిక్షపతి, ఏఎన్‌ఎం అల్లిక, ఆశలు పాల్గొన్నారు.

మిత్రమా.. మేమున్నాం

- ఆదర్శంగా నిలుస్తున్న పదో తరగతి పూర్వవిద్యార్థులు
- పేదలకు అండగా సేవా కార్యక్రమాలు

Sunday Special

పెద్దవంగర: వారంతా చిన్నప్పటి దోస్తులు.. పదో తరగతి వరకు కలిసి చదువుకున్నారు. పాఠశాల విద్య పూర్తయ్యాక పలు రంగాల్లో స్థిరపడినా స్నేహాన్ని మరువలేదు. కష్టాల్లో ఉన్న మిత్రులకు మేమున్నామంటూ ఆదుకుంటున్నారు. తాము చదువుకున్న పాఠశాల్లోని విద్యార్థులకు విద్యా సామగ్రి అందిస్తూ పేదలకు అండగా నిలుస్తున్నారు. స్నేహితుల కుటుంబ సభ్యుల్లో ఎవరైన మృతి చెందితే వారి కుటంబానికి అండగా ఉంటున్నారు. వారి స్నేహాన్ని కలకాలం పదిలం చేసుకుంటూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు.

మండలంలోని చిట్యాల గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల 2007–08బ్యాచ్ పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు 60 మంది వాట్సప్ గ్రూపులను ఏర్పాటు చేసుకున్నారు. దీని ద్వారా సమాచారం అందించుకుంటూ డబ్బులను జమ చేస్తారు. అందరి నుంచి సేకరించిన నగదును ఒక రోజు బాధితుడి ఇంటికి వెళ్లి సాయం అందజేస్తారు.



బాధిత కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందజేస్తున్న మిత్రులు (ఫైల్)



విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు (ఫైల్)

మిత్రుల కుటుంబాలకు ఆర్థికసాయం..

మండలంలోని చిట్యాల గ్రామంలో తోటి మిత్రుల కుటుంబ సభ్యులు మృతి చెందగా వారి కుటుంబాలకు ఆర్థిక సాయం అందించిన వారి వివరాలు .. మందపురి అనిల్ తండ్రి సోమయ్య మృతి చెందగా కుటుంబానికి రూ.10వేలు, బానోతు జేతిరామ్ తండ్రి సూర్య మృతి చెందగా రూ.10వేలు, కందుల మహేందర్ తండ్రి మృతి చెందగా రూ.10 వేలు, ఆవుల మహేశ్ తండ్రి వెంకటసోములు మృతి చెందగా రూ.10వేలు, దరావత్ నరేష్ తల్లి కమిలి మృతి చెందగా రూ.5వేలు అందజేశారు. తమతో అక్షరాలు దిద్ది అకాల మరణం చెందిన ఈదురు ప్రేమ్‌కుమార్ కుటుంబ సభ్యులకు రూ20వేలు అందజేసి తమ ఔన్నత్యాన్ని చాటుకున్నారు.

పాఠశాల విద్యార్థులకు..

చదువుకున్న పాఠశాల్లోని విద్యార్థులకు విద్యా సామగ్రితోపాటు వాటర్ బాటిల్స్, తదితర వస్తువుల వితరణ చేశారు. కరోనా కాలంలో సుమారు 150 మందికిపైగా నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. ఇలా పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు.

సేవలు కొనసాగిస్తాం..



కరోనా కాలంలో తమవంతు సాయం చేయాలనే సంకల్పం వచ్చింది. తాము చదువుకున్న మిత్రులంతా కలిసి 2020లో వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసుకున్నాం. నాటి నుంచి నేటి వరకు తమ వంతు సాయం అందిస్తున్నాం.

– ఆవుల మహేష్, చిట్యాల

సమాజ సేవలో తృప్తి



ఆపదలో ఉన్నవారికి ఆర్థికంగా చేయూత ఇవ్వడం ఎంతో తృప్తినిస్తుంది. 2020 నుంచి ఇప్పటి వరకు అనేక సేవా కార్యక్రమాలు అందించాం. భవిష్యత్‌లో మిత్రుల సాయంతో మరిన్ని కార్యక్రమాలు చేపడతాం.

– కందుల మహేందర్, చిట్యాల

నిరుపేదలకు కార్పొరేట్ వైద్యం

- ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్

మహబూబాబాద్ రూరల్: నిరుపేదల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా రూ.10లక్షల వ్యయంతో కార్పొరేట్ స్థాయి వైద్యం అందిస్తుందని ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో రూ.21లక్షల విలువ గల సీఎం సహాయ నిధి చెక్కులను బాధిత కుటుంబాలకు శనివారం ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. కార్యక్రమంలో అర్బన్ అధ్యక్షుడు ఘనపురపు అంజయ్య, వార్డు కౌన్సిలర్లు పోతురాజు రాజు, తాళ్లపల్లి జగన్, భూక్య శ్రీను, బానోత్ హరిసింగ్, బుజ్జివెంకన్న, అల్లం నాగేశ్వర్ రావు, ఎడ్ల రమేశ్ పాల్గొన్నారు.



సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్

ఆరోపణలు నిరూపించాలి



మాట్లాడుతున్న అంజయ్య

మహబూబాబాద్ రూరల్: ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు, ఆయన వర్గీయులు తనపై చేసిన ఆరోపణలు నిరూపించాలని కాంగ్రెస్ అర్బన్ అధ్యక్షుడు ఘనపురపు అంజయ్య డిమాండ్ చేశాడు. జిల్లా పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు క్షమాపణ చెప్పాలన్నారు. ఎమ్మెల్సీ వ్యక్తిగతంగా కొంతమంది వ్యక్తులతో తనను తిట్టించినంత మాత్రాన భయపడే వ్యక్తిని కాదని, కాంగ్రెస్ పార్టీ అంటేనే ఉద్యమాలకు, పోరాటాలకు పెద్దపీట అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులు, ఉద్యమ నాయకులను ఎమ్మెల్సీ మోసం చేసిన అంశాలపై తన దగ్గర ఆధారాలున్నాయని తెలిపారు. ప్రైవేట్ వ్యక్తుల భూములను ఆక్రమించి రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడని, ఎంతో మందిని బెదిరింపులకు గురిచేశాడన్నారు. ఈ సమావేశంలో గుండగాని వేణు, బాబురావు, గోగుల మల్లయ్య, పింగ్రాల రామదాసు, భూక్య విజయ, బానోత్ ప్రసాద్, ఆరెందుల వెంకటేశ్వర్లు, నారోజు సత్యమనోరమ, సింగం మనోహర్, భువనగిరి గిరిధర్ గుప్తా, తదితరులు పాల్గొన్నారు.

బడుల బలోపేతానికి కృషి చేయాలి

చిన్నగూడూరు: దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న డీఎలను వెంటనే విడుదల చేసి, మండలానికి ఒక విద్యాశాఖాధికారిని నియమించి ప్రభుత్వ బడుల బలోపేతానికి కృషి చేయాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు చుంచు శ్రీశైలం కోరారు. శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ చిన్నగూడూరు మండల శాఖ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు చుంచు శ్రీశైలం హాజరై మాట్లాడారు. అనంతరం మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా వెంకట్రాం నర్సయ్య, ప్రధాన కార్యదర్శిగా వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులుగా కృష్ణ, హారతి, కార్యదర్శులుగా నాగేశ్వర్, సుగుణాకర్, స్వప్న ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.



మాట్లాడుతున్న శ్రీశైలం

పంచాయతీ ఎన్నికల్లో సత్తా చాటుతాం..



బీజేపీలో చేరిన యువకులు

తొర్రూరు రూరల్: రానున్న గ్రామ పంచాయతీ ఎన్నికల్లో అత్యధిక స్థానాలను కైవసం చేసుకుని బీజేపీ సత్తా చాటుతుందని పార్టీ జిల్లా అధ్యక్షుడు యమంచిలి వెంకటేశ్వర్‌రావు అన్నారు. శనివారం మండలంలోని అమ్మాపురం గ్రామానికి చెందిన సుమారు 100 మంది యువకులు బీజేపీ బూత్ అధ్యక్షుడు సిరిపాటి విశాల్, రాజేందర్ ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు ధర్మరాపు వెంకన్న, భారతి, పార్టీ మండల రూరల్, పట్టణ అధ్యక్షుడు కస్తూరి పులేందర్, అలిసిరి రవిబాబు, నాయకులు కొండ యాకన్న, గుండా సురేష్, కిన్నెర పాండు పాల్గొన్నారు.

బహుజనులు రాజ్యాధికారం చేపట్టాలి

గూడూరు: దేశ సంపద పేద ప్రజలకు సమానంగా పంపిణీ జరగాలంటే బహుజనులు రాజ్యాధికారం చేపట్టాలని ఎంసీపీఐ (యూ) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి అన్నారు. మండల కేంద్రంలో శనివారం పార్టీ జిల్లా స్థాయి రాజకీయ శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా హాజరై ఆయన మాట్లాడుతూ.. ఇప్పటి వరకు దేశాన్ని అగ్రకుల పార్టీలే ఏలాయని, ఇప్పటికైనా బహుజనులు మేల్కొనాలని ఆయన పిలుపునిచ్చారు. సమసమాజ స్థాపన కోసం పార్టీ సభ్యులు, కార్యకర్తలు ప్రజలను చైతన్యం చేయాలని కోరారు. కార్యక్రమంలో గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఈసం రామయ్య, జిల్లా నాయకులు కంచ వెంకన్న, నూకల ఉపేందర్‌యాదవ్, బండెల వీరస్వామి, గుండగాని సత్తయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రవి

న్యాయం చేయాలని ఆందోళన



పురుగుల మందు డబ్బా పట్టుకుని మాట్లాడుతున్న స్వప్న

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని శనిగపురం గ్రామంలో అనారోగ్యంతోపాటు మనోవేదనకుగురై మృతిచెందిన మంద రవి కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ పురుగుల మందు డబ్బాతో అతడి భార్య స్వప్న, బంధువులు శనివారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా స్వప్న మాట్లాడుతూ.. తన మామ వెంకన్నకు సంబంధించిన రైల్వే ఉద్యోగం ఆయన మృతిచెందాక తన భర్త రవికి వచ్చేలా చూస్తామని చెప్పారన్నారు. తమను మోసం చేసి వెంకన్న రెండో భార్య జ్యోతి కుమారుడు సాయికిరణ్‌కు రైల్వే ఉద్యోగం ఇప్పించుకున్నారని తెలిపింది. దీంతో తన భర్త రవి మనోవేదనకు గురై అనారోగ్యం బారినపడి మృతి చెందాడని ఆవేదన వ్యక్తం చేసింది. రవిని చూసేందుకు వచ్చిన పినతల్లి జ్యోతి గుండెపోటుతో మృతిచెందగా ఆమె కుమారుడు సాయికిరణ్ తామే ఆమెను కొట్టి చంపినట్లు సృష్టించి పోలీస్‌స్టేషన్‌లో కేసు పెట్టారని విచారం వ్యక్తం చేసింది. ఇప్పటికైనా తన ఆవేదనను అర్థం చేసుకుని న్యాయం చేయాలని కోరింది. కాగా మృతురాలు జ్యోతి కుమారుడు సాయికిరణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. జరిగిన సంఘటనలపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామని రూరల్ ఎస్సై వి.దీపిక రెడ్డి తెలిపారు.

అనారోగ్యంతో ఆత్మహత్య

పెద్దవంగర: అనారోగ్యంతో మనస్తాపం చెంది ఓ వ్యక్తి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలో శనివారం చోటు చేసుకుంది. ఏఎస్సై విజయరాజు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని వడ్డెకొత్తపల్లి గ్రామానికి చెందిన దంతాలపల్లి వెంకన్న (57) కూలి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కొంత కాలంగా అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నాడు. వైద్యం చేయించుకున్నప్పటికీ ఆరోగ్యం కుదుటపడలేదు. వెంకన్నకు ఇద్దరు కుమారులు కాగా పెద్ద కొడుకు హైదరాబాద్‌లో ఉంటున్నాడు. భార్య, చిన్నకొడుకు పనుల నిమిత్తం పక్క గ్రామానికి వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని మృతి చెందాడు. భార్య బుజ్జమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్న ఏఎస్సై తెలిపారు.

ఆభరణాల చోరీ

మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలోని నరసింహనగర్‌లో నివాసం ఉండే నాముని మురళీకృష్ణ, మంజుల ఇంట్లో చోరీ జరిగి తులం బంగారు, తులం వెండి ఆభరణాలు, రూ.7వేల నగదు అపహరణకు గురయ్యాయి. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. మురళీకృష్ణ, మంజుల దంపతులు వ్యాపారం చేస్తుంటారు. శుక్రవారం ఉదయంఇంటికి తాళం వేసి వ్యాపారానికి వెళ్లారు. తిరిగి రాత్రి ఇంటికి వచ్చేసరికి దొంగలు ఇంటి తాళాలు పగలగొట్టిన విషయాన్ని గమనించారు. ఇంట్లోకి చొరబడి బీరువాలో ఉన్న ఆభరణాలు అపహరించుకుపోయారు. శనివారం ఉదయం పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేయగా ఫింగర్ ప్రింట్ బృందం సభ్యులు సంఘటన స్థలానికి చేరుకుని వేలిముద్రల ఆధారాలు సేకరించారు.

పాఠశాలల్లో ముందస్తు కృష్ణాష్టమి

జిల్లా వ్యాప్తంగా పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ముందస్తు శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు గోపిక, విద్యార్థులు శ్రీకృష్ణ వేషధారణలో అలరించారు. చిన్నారులు ఉట్టికొట్టి సంబురాలు చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



గార్ల: అంగన్‌వాడీ కేంద్రంలో..



కేసముద్రం: శ్రీవివేకవర్ధిని హైస్కూల్‌లో..



మానుకోట శ్రీచైతన్య టెక్నో స్కూల్‌లో..



దంతాలపల్లి: ప్రభుత్వ పాఠశాలలో..



తొర్రూరు రూరల్: అరిపిరాల ప్రభుత్వ పాఠశాలలో ఉట్టి కొడుతున్న విద్యార్థులు

సంక్షిప్త సమాచారం

పారిశుద్ధ్య పనుల పరిశీలన

తొర్రూరు రూరల్: మండలంలోని అన్ని గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీడీఓ వేణుమాధవ్ అన్నారు. శనివారం మండలంలోని పోలెపెల్లి గ్రామంలో కొనసాగుతున్న చెత్తాచెదారం, మురుగు నీరు తొలగించడం వంటి పనులను పరిశీలించారు.

ఈఓపై ఫిర్యాదు

గార్ల: మర్రిగూడెం వేట వేంకటేశ్వరస్వామి ఈఓ నందనం కవితపై చర్య తీసుకోవాలని కోరుతూ శనివారం వరంగల్‌లోని ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్‌కు లాయర్ భూక్యా హరినాయక్ ఫిర్యాదు చేశారు. ఈనెల 28న నిర్వహించే దేవాలయం ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ కార్యక్రమానికి ఎమ్మెల్యే కోరం కనకయ్యను ఆహ్వానించకుండా ఏకపక్ష ధోరణితో వెళ్తున్న ఈఓపై చర్య తీసుకోవాలని ఆయన కోరారు.

నీట్ పీజీ ఫలితాల్లో ప్రతిభ

మహబూబాబాద్ అర్బన్: నీట్ పీజీ అర్హత పరీక్ష ఫలితాల్లో శనివారం విడుదల అయ్యాయి. మానుకోట మున్సిపల్ పరిధిలోని జమాండ్లపల్లికి చెందిని డాక్టర్ చిల్పూరి గణేశ్ ఆల్‌ఇండియా స్థాయిలో 3000ర్యాంక్ సాధించి ప్రతిభ చాటాడు.

సభ్యత్వ నమోదు

గార్ల: జనవిజ్ఞాన వేదిక సభ్యత్వ నమోదు కార్యక్రమంను శనివారం గార్లలో సంఘం మండల అధ్యక్షుడు మాచర్ల సుందర్‌కుమార్ ప్రారంభించారు. ఈసందర్భంగా తొలి సభ్యత్వాన్ని ఎస్సై ఎస్.జీనత్‌కుమార్‌కు అందజేశారు.

గురుకులాన్ని సందర్శించిన ఎంపీడీఓ

మరిపెడ: మరిపెడ మున్సిపాలిటీ పరిధిలోని గిరిజన సంక్షేమ మినీ గురుకులాన్ని ఎంపీడీఓ విజయ సందర్శించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు గురుకులంలో విద్యార్థులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

వసతి గృహం తనిఖీ

దంతాలపల్లి: వసతి గృహంలో విద్యార్థులకు మెరుగైన ఆహారం అందించాలని మండల ప్రత్యేక అధికారి వీరన్న అన్నారు. మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలను శనివారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా విద్యార్థులకు అందించే ఆహారాన్ని పరిశీలించారు.

మధ్యాహ్న భోజన పథకానికి నిధులు పెంచాలి

బయ్యారం: మధ్యాహ్న భోజన పథకానికి ప్రభుత్వం నిధులు పెంచాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కోకన్వీనర్ గుగులోత్ సూర్యప్రకాశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం బయ్యారంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

దంతాలపల్లి: మండల కేంద్రంలో నేడు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు ఏఈ ప్రవీణ్ శనివారం తెలిపాడు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

రుణమాఫీపై ఆందోళన వద్దు

పెద్దవంగర: అర్హులైన రైతులందరికి రుణమాఫీ జరుగుతుందని, రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని ఏఈఓ రాజు అన్నారు. రుణమాఫీ కాని రైతుల ఫిర్యాదులను శనివారం మండలంలోని చిట్యాల గ్రామంలోని రైతు వేదికలో స్వీకరించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

కురవి: మండల కేంద్రంతోపాటు అయ్యగారిపల్లి గ్రామంలో నాయకులు సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు నారాయణ రాజేందర్‌కుమార్, అయ్యగారిపల్లి గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

28న ఐకేపీ వీఓఏల ధర్నా

మహబూబాబాద్ రూరల్: ప్రభుత్వం ఐకేపీ వీఓఏలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సంఘం మండల అధ్యక్షురాలు నీలం కృష్ణవేణి అన్నారు. శనివారం నిర్వహించిన సంఘం సమావేశంలో ఆమె మాట్లాడారు. ఐకేపీ వీఓఏల సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 28వ తేదీన డీఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్నామని మండలంలోని వీఓఏలందరూ పాల్గొనాలని కోరారు. ఈ సమావేశంలో లలిత, కామాక్షి, శోభ, అరుణ, అనిత పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు న్యాయం చేయాలి

తొర్రూరు: అంగన్‌వాడీ సిబ్బందికి ఇచ్చిన హామీలు నెరవేర్చి న్యాయం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్ అన్నారు. డివిజన్ కేంద్రంలోని యూనియన్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సంఘ అధ్యక్షురాలు గండి శైలజ, జమ్ముల శ్రీను, పసుల స్వరూప, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి

మహబూబాబాద్ అర్బన్: రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ పట్ల మధు అన్నారు. జిల్లా కేంద్రంలోని పలు కళాశాలలను ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శనివారం సందర్శించారు.

10శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి

తొర్రూరు: జనాభా దామాషా ప్రకారం గిరిజనులకు 10 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని బీజేపీ గిరిజన మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి రాయపురం రాజ్‌కుమార్ అన్నారు. ఈ మేరకు శనివారం తహసీల్దారు వినోద్‌కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో నాయకులు పల్లె కుమార్, పైండ్ల రాజేష్, పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదు

మహబూబాబాద్ అర్బన్: బీజేపీ జిల్లా కార్యాలయంలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈసందర్భంగా రాష్ట్ర సహాయ కోశాధికారి ఓఎస్‌రెడ్డి హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శులు మురళీ, వెంకన్న, శశివర్ధన్‌రెడ్డి, లక్ష్మణ్‌రావు, పెంటయ్య, అధికార ప్రతినిధి ఇందుభారతి పాల్గొన్నారు.

హోలీవర్డ్స్ హైస్కూల్‌కు అరుదైన గుర్తింపు

మహబూబాబాద్ అర్బన్: హైదరాబాద్ ది పార్క్ హోటల్ యూనివర్సల్ మెంట్రోస్ అసోసియేషన్ వారు నిర్వహించిన 15వ ఎడ్యూలీడర్స్ సమ్మిట్ అవార్డ్స్‌లో జిల్లా కేంద్రానికి చెందిన హోలీవర్డ్స్ హైస్కూల్ ఎంపికైంది. అసోసియేషన్ సీఈఓ సందీప్, ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు మధుసూదన్ హోలివర్డ్స్ స్కూల్ డైరెక్టర్ అభిషేక్‌కు శనివారం ఎడ్యుకేషన్ ఐకాన్ ఆఫ్ ది ఇయర్ 2024 అవార్డు అందజేశారు.

15క్వింటాళ్ల నల్లబెల్లం స్వాధీనం

డోర్నకల్: టాటా ఏస్ వాహనంలో అక్రమంగా తరలిస్తున్న పదిహేను క్వింటాళ్ల నల్లబెల్లాన్ని డోర్నకల్ పోలీసులు పట్టుకున్నారు. ఏఎస్సై మజీద్ శనివారం తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక బాబూజగ్జీవన్ రాం విగ్రహం వద్ద తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో టాటా ఎస్ వాహనం వెళ్తుండగా తనిఖీలు నిర్వహించగా 30బస్తాల్లో నల్లబెల్లం, రెండు బస్తాల పటిక పట్టుబడినట్లు తెలిపారు. ఎన్‌టీఆర్ జిల్లా షేర్ మహ్మద్ పేటకు చెందిన టాటా ఏస్ వాహన యజమాని, డ్రైవర్ వీరస్వామి బెల్లాన్ని సీరోలు మండలం మోదుగ్గడ్డతండాకు చెందిన గుగులోత్ నరేష్‌కు విక్రయించేందుకు తెచ్చినట్లు విచారణలో తేలిందన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్సై తెలిపారు.

గుడుంబా పట్టివేత

మండలంలోని గుర్రాలకుంట గ్రామంలో శనివారం గోప్యా ఇంటిపై దాడులు నిర్వహించి, 200లీటర్ల బెల్లంపానకం ధ్వంసం చేసి, 7లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ సూర్యనారాయణ తెలిపారు.